క్లుప్తంగా

సోషల్ ఆడిట్‌కు రెడీ



రికార్డులను సరిచేసుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో సోషల్ ఆడిట్‌కు ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్‌తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్ధమవుతున్నారు. శనివారం సెలవుదినం అయినా మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు కార్యాలయం ఆవరణలో రికార్డులను సరి చేస్తూ బిజీబిజీగా ఉన్నారు. 2014–2015 సంవత్సరంలో గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పథకం ద్వారా పనుల వివరాలతో గ్రామాలకు వెళ్లేందుకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు వచ్చేశారు. మండలంలో మొత్తం 38 గ్రామాలు ఉన్నాయి. సోమవారం నుంచి గ్రామాల వారీగా సామాజిక తనిఖీ బృందం పర్యటించనున్నట్లు ఏపీఓ ప్రభాకర్ తెలిపారు.

బొడ్డెమ్మ ఆటలు ప్రారంభం



బొడ్డెమ్మ ఆడుతున్న ఆడపడుచులు

హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ ఆడబిడ్డలు ఆత్మగౌరవంగా జరుపుకొనే బతుకమ్మ ఆటలకు తొమ్మిది రోజుల ముందు నుంచే పల్లెల్లో బొడ్డెమ్మ ఆటలు ఆడుకుంటారు. శనివారం పొట్లపల్లిలో ఎర్రమట్టితో గౌరమ్మను తయారు చేసి పూలతో అలంకరించి మహిళలు ఆడిపాడారు. తొమ్మిది రోజులు గౌరిదేవికి పూజలు చేస్తారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: ఇటీవల మృతి చెందిన పుల్లూరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ చిటుకుల ప్రసాద్ తండ్రి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు శనివారం పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, భరోసానిచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నరేశ్, ప్రభాకర్‌వర్మ, మాజీఎంపీపీ చందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌కు..



అమరేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ అమరేందర్ తల్లి భాగమ్మ ఇటీవల మృతి చెందింది. శనివారం ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిలు కుకునూరుపల్లిలో అమరేందర్‌ను పరామర్శించి భాగ్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవి రవీందర్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కుమార్, నాయకులు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంటేరుకు..



వజ్రమ్మకు నివాళులర్పిస్తున్న ఎంపీ రాజేందర్

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్ నేత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తల్లి వజ్రమ్మ ఇటీవల మృతి చెందింది. శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం ప్రతాప్‌రెడ్డి స్వగ్రామమైన దౌలాపూర్‌కు చేరుకుని వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతాప్‌రెడ్డితో పాటు సోదరులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్, శ్రీధర్, బాల్‌రాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్లలో అపర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్‌రైజ్ ఆస్పత్రి సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుమోహం, రక్త, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది, అపర్ణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు హరీశ్, మాజీ సర్పంచ్ నాగభూషణం, ఐఏఎస్ పుస్తక రచయిత శంకరాచారి, ఇన్‌చార్జి రాజేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల దందా!

రైతులకు పంట రుణాల రెన్యువల్ కష్టాలు

- అప్పు కడితేనే రెన్యువల్, వడ్డీ రాయితీలు
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు



హుస్నాబాద్‌లో బ్యాంకు ఎదుట రైతులు

హుస్నాబాద్‌రూరల్: రైతులు పంటల పెట్టుబడుల కోసం బ్యాంకులను ఆశ్రయించడంతో అధికారులు పట్టా పాసు పుస్తకాలను తాకట్టు పెట్టుకొని రుణాలు ఇస్తున్నారు. ఏడాదికి ఒకసారి రుణం చెల్లిస్తే అధికారులు రుణాలను రెన్యువల్ చేస్తారు. రైతులు ఎకరాకు రూ.60వేల చొప్పున ఎన్ని ఎకరాలు ఉంటే అంత రుణం తీసుకుంటారు. ఏడాది గడిచిన తర్వాత వడ్డీ చెల్లిస్తే రుణం రెన్యువల్ చేయాల్సి ఉండగా బ్యాంకు అధికారులు మాత్రం వడ్డీతో సహా రుణం మొత్తం చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తున్నారు. పెట్టుబడుల సమయంలో రైతులు రుణాలు చెల్లించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రైతుల అవసరాలను ఆసరా చేసుకుని వడ్డీ వ్యాపారులు బ్యాంకుల ఎదుట కూర్చోని రైతుల ఖాతా పుస్తకాలను తాకట్టుపెట్టుకొని లక్షకు వేయి చొప్పున ఒకటి, రెండు రోజులకే వడ్డీకి ఇస్తున్నారు. కొందరు లక్షకు రెండు వేలు వసూలు చేస్తున్నారు. రుణం చెల్లించకపోతే వడ్డీ రాయితీ రాదని రైతులు భయంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వడ్డీ వ్యాపారులు బ్యాంకుల ఎదుటే దందా సాగిస్తున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోక పోవడంతో వడ్డీ వ్యాపారులు అడ్డుఅదుపు లేకుండా దందా కొనసాగిస్తున్నారు.

ఎరువుల కష్టాలకు తోడు రుణాల తిప్పలు

రైతులు యూరియా బస్తాల కోసమే నిత్యం కష్టాలు పడుతుంటే, పంట రుణాల కష్టాలు కలవర పెడుతున్నాయి. సమయానికి ఎరువులు వేయక పంట ఎదగకపోవడంతో దిగుబడులు రావని ఆందోళన చెందుతున్నారు. పంటల సాగుకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినా చేతికి వచ్చే నమ్మకం లేకపోవడంతో మెట్ట ప్రాంత రైతుల సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు పంట రుణాలకు వడ్డీ తీసుకొని రెన్యువల్ చేస్తే వడ్డీ వ్యాపారుల బాధలు తప్పుతాయని వాపోతున్నారు.

చర్యలు తీసుకోవాలి



రైతుల పంట రుణాలను బ్యాంకు అధికారులు వడ్డీ తీసుకొని రెన్యువల్ చేయాలి. మొత్తం అప్పు కట్టాలంటే వడ్డీ వ్యాపారులు 10 పైసల వడ్డీ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే వడ్డీ, రాయితీ రైతుకు రావడం లేదు. మంత్రి, కలెక్టర్ స్పందించి వడ్డీ తీసుకొని రుణాలు రెన్యువల్ చేస్తే వడ్డీ వ్యాపారుల దందాకు అడ్డుకట్ట పడుతుంది.

– పి. రవీందర్, రైతు సంఘం నాయకుడు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



రాజీవ్‌చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: గ్రామ పంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ఖేడ్ రాజీవ్ చౌక్‌లో శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నర్సింహులు మాట్లాడుతూ కంగ్టిలో గ్రామ పంచాయతీ కార్మికులపై ఎంపీడీఓ, ఎంపీఓలు నిర్లక్ష్యంగా వ్యవహరించి దూషించారన్నారు. ఈ మేరకు కంగ్టి ఎంపీడీఓ, ఏపీఓలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. లేని పక్షంలో కార్మికులతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు సతీష్, సంతోష్, కార్మికులు అంజయ్య, బాలప్ప, లక్ష్మయ్య, అంబేద్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు కాన్షీరాం, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహులు, సంతోష్, అరుణ్ పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



లింగుపల్లి చౌరస్తాలో ఆందోళన చేస్తున్న రైతులు

మిరుదొడ్డి(దుబ్బాక): పది రోజులుగా క్యూలైన్‌లో నిలబడి పాట్లు పడుతున్నా ఒక్క యూరియా బస్తా కూడా దొరకడం లేదని మండల పరిధి లింగుపల్లి చౌరస్తా వద్ద శనివారం రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. టోకెన్ల విషయంలో అధికారులు తమకు అనుకూలంగా ఉన్న వారికి టోకెన్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని సార్లు క్యూలైన్‌లో నిలబడిన టోకెన్లు దొరకడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయ గ్రామాల రైతులు అసహనం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమకు సకాలంలో యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సీఐ శ్రీనివాస్ ఫోన్ ద్వారా జిల్లా వ్యవసాయ అధికారులతో మాట్లాడి రైతులకు నచ్చజెప్పారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

పెన్షన్లు పెంచకపోతే మూల్యం తప్పదు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజుమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

దుబ్బాక: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజుమాదిగ హెచ్చరించారు. శనివారం దుబ్బాకలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి పెన్షన్‌దారుల ఓట్లు దండుకునేందుకు తాము అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే వికలాంగులకు రూ.6 వేలు, మిగతా అందరికీ రూ.4 వేలు పెంచుతానని చెప్పి 22 నెలలు గడుస్తున్నా పెంచడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పెన్షన్‌ల పెంపుకోసం 15న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి, 20న అన్ని గ్రామ పంచాయతీల ఎదుట మహాదీక్షలు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో దొమ్మాట జోగయ్య, లక్ష్మయ్య, ప్రభాకర్, రాజయ్య, రమ్య, హరీఫ్ తదితరులు ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో 85మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రూ.72,600 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

గంప ఎంతమ్మా..!



సీతాఫలాలు కొనుగోలు చేస్తున్న ఎంపీ ఈటల

జగదేవ్‌పూర్(గజ్వేల్): అమ్మ బాగున్నారా.. సీతాఫలాలు బాగున్నాయి.. గంప ఎంతకు అమ్ముతున్నారంటూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మహిళలను ఆత్మీయంగా పలకరించారు. శనివారం దౌలాపూర్‌లో వంటేరు ప్రతాప్‌రెడ్డిని పరామర్శించడానికి వెళ్తూ గొల్లపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన సీతాఫలాలు అమ్ముతున్నా మహిళలను చూసి కారు దిగారు. నాలుగు గంపల సీతాఫలాలను రూ. 12 వందలకు కొనుగోలు చేశారు. మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సిద్దిపేటఅర్బన్: మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో శుక్రవారం రాత్రి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు ఎవరైనా అలవాటు పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వక్తులకు బ్యాంకు వివరాలు, పిన్ నంబర్, ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రధాన వీధులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వ్యాపారస్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తెలంగాణ ఈగల్ సోల్జర్స్ రాధారి నాగరాజు, నవీన్‌కుమార్‌లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో సిద్దిపేట అర్బన్ ఎంఈఓ రాజప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. సోషల్ మీడియా, చెడు స్నేహితుల ప్రభావం నుంచి దూరంగా ఉండాలని సూచించారు.

15న రెవెన్యూ ఆఫీస్ ముట్టడి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలోని ఆసరా పింఛన్‌లను పెంచకపోవడాన్ని నిరసిస్తూ, ఈ నెల 15న తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కొలిమి మల్లేశం అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్లు పెంచుతామని శాసన సభ ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ..ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. 15న తహసీల్ ఆఫీస్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి లక్ష పుష్పార్చన



వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ వర్గల్ క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధి శనివారం కృత్తిక నక్షత్ర మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అర్చకులు మూలవిరాట్టుకు విశేష అభిషేకం చేశారు. సుబ్రహ్మణ్య నామా లు పఠిస్తూ సామూహిక లక్ష పుష్పార్చన చేశారు. భక్తజనులు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని, ప్రధాన ఆలయంలో సరస్వతీ అమ్మవారిని, అనుబంధ లక్ష్మీగణపతి, శనీశ్వర, చంద్రమౌళీశ్వర, వేంకటేశ్వరాలయాల్లో దేవతా మూర్తులను దర్శించుకుని తరించారు. సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు క్షేత్రాన్ని సందర్శించారు.

లోక్ అదాలత్‌లో 373 కేసులు పరిష్కారం

సివిల్ కోర్టు జూనియర్ జడ్జి రేవతి



మాట్లాడుతున్న జడ్జి రేవతి

హుస్నాబాద్: కక్షిదారుల పరస్పర అంగీకారంతో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ వేదిక అని ప్రిన్సిపాల్ సివిల్ కోర్టు జూనియర్ జడ్జి రేవతి అన్నారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ కేసులకు సత్వర న్యాయం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమయం, డబ్బులు వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా ఇరువురికి న్యాయం జరుగుతుందని చెప్పారు. లోక్ అదాలత్‌లో 373 కేసులు పరిష్కారమయ్యాయని వివరించారు. కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ అడిషనల్ జూనియర్ జడ్జి ప్రమీద, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజశేఖర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి



కోతకు గురైన రోడ్లను పరిశీలిస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షానికి కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని మైసమ్మవాగుతండా గ్రామ పరిధిలో కోతకు గురైన రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరిజనతండాల్లో ఇటీవల నిర్మించిన రోడ్లన్నీ కోతకు గురికావడంతో పాటు సైడ్ బర్మ్‌లు పూర్తిగా కొట్టుకుపోయాయని అన్నారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగకముందే మరమ్మతులు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ జనగామ వేణుగోపాల్‌రావు, మండల ప్రధానకార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, మాజీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూనావత్ మోహన్‌నాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

కోహెడరూరల్(హుస్నాబాద్): బస్వాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2003–2004 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆటాపాటలతో పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు ఆకట్టుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. వారితో సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, వనేశ్, రంజిత్, శేఖర్, రాజేందర్, భిక్షపతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కమ్యూనిస్టుల పోరాటంతోనే అభివృద్ధి

సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



సమావేశంలో మాట్లాడుతున్న పవన్

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి, గౌరవెల్లి ప్రాజెక్టు కోసం సీపీఐ చేసిన పోరాటాలు ప్రజలందరికీ తెలిసిన విషయమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో శనివారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ పోరాట యోధులు వేముల నర్సింహులు, చీకట్ల ముత్తయ్యలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమరుల ఆశయ సాధనకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే, హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతర పోరాటం చేసింది కమ్యూనిస్టు పార్టీయేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొమ్ముల భాస్కర్, వనేశ్, జనార్దన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుదర్శన్‌చారి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కేబుళ్లను స్వచ్ఛందంగా తొలగించాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ స్తంభాలకు అడ్డంగా ఉన్న కేబుళ్లను స్వచ్ఛందంగా తొలగించాలని విద్యుత్‌శాఖ ఏడీఈ సుధాకర్‌రెడ్డి కేబుల్ ఆపరేటర్లకు సూచించారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ ఏడీఈ కార్యాలయంలో వివిధ కంపెనీలకు చెందిన కేబుల్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదాలకు కారణంగా ఉన్న కేబుళ్లను నిర్వాహకులే తొలగించాలన్నారు. ఏఈలు హుస్సేన్, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

◆ **విజయవంతం చేద్దాం**

హుస్నాబాద్: 17న ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని నిర్వహించే సేవాపక్ష కార్యక్రమాలు విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు పిలుపునిచ్చారు. శనివారం సేవా పక్ష కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు.

◆ **క్రీడల్లో రాణించాలి**

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ తెలంగాణ ఆదర్శ మోడల్ స్కూల్(టీజీఎంఎస్) ప్రిన్సిపాల్ వన్నిసా పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సిద్దిపేటలోని బాలిక ఉన్నత పాఠశాలలో అండర్–17 విభాగంలో ఇటీవల నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గజ్వేల్‌లోని టీజీఎంఎస్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇందులో గజ్వేల్ జట్టు నుంచి తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని లావణ్య అత్యుత్తమ ప్రతిభను చాటి జోనల్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

17న విమోచన దినోత్సవ వేడుకలు



చేర్యాల(సిద్దిపేట): మాట్లాడుతున్న కల్నల్ భిక్షపతి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో వేడుకలు నిర్వహించి జాతీయ జెండాలు ఎగురవేయాలని జిల్లా దిశ కమిటీ సభ్యురాలు వనజ, బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్‌లు పేర్కొన్నారు. శనివారం చిన్నకోడూరులో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అదే రోజు ప్రధాని జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్ వంటి సేవా కార్యక్రమాలు, మొక్కలు నాటడం వంటివి నిర్వహించాలన్నారు. అక్టోబర్ 2 వరకు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు పరుశురాములు, సంతోశ్‌కుమార్, నాగరాజు, మహేశ్, బాపయ్య ఉన్నారు.

చేర్యాలలో బీజేపీ కార్యశాల

చేర్యాల(సిద్దిపేట): స్థానిక వీరభద్ర గార్డెన్‌లో శనివారం బీజేపీ మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు, కర్క తిరుపతిరెడ్డిల ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కల్నల్ భిక్షపతి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం, దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్, మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, సత్యవర్ధన్, సంజీవరెడ్డి, బాలరాజు, సిద్ధిలింగం, మనీష్, చంద్రమౌళి, వెంకటేశం, బాబు, యాదగిరి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలు ఎగురవేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ప్రతి బూత్‌లో ఈనెల 17న తెలంగాణ విమోచన వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీజేపీ మండల ఇన్‌చార్జి సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. బెజ్జంకిలో శనివారం ఏర్పాటు చేసిన మండల కార్యశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ జెండాలను ఎగురవేయాలని సూచించారు.